పీఆర్ ఇంజనీర్లకు బదిలీల కౌన్సెలింగ్

అందరూ పీఐయూ, క్యూసీలకు వెళ్తామంటే కుదరదు

ఈఎన్‌సీ బాలు నాయక్

అనంతపురం న్యూటౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ఉమ్మడి జిల్లాల పంచాయతీరాజ్ ఇంజనీర్లకు మంగళవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతపురం పంచాయతీ రాజ్ సర్కిల్ కార్యాలయంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతపురం ఎస్ఈ జహీర్ అస్లామ్, కడప ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, కర్నూలు ఎస్ఈ రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎస్ఈ చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఈఎన్‌సీ బాలు నాయక్ అధ్యక్షతన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రాజెక్ట్ ఇంప్లిమేంటేషన్ యూనిట్ (పీఐయూ), క్వాలిటీ కంట్రోల్ (క్యూసీ) విభాగాలు కావాలంటే కుదరదు. పీఆర్‌ఐలో క్షేత్రస్థాయి ప్లేసులు ఆప్షన్ ఇచ్చిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. ఒకేచోట ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారు, కార్యాలయాల్లో మకాం వేసిన వారు తప్పని సరిగా బయటకు వెళ్లాల్సిందేనని చెప్పారు. స్పౌజ్, ఆరోగ్య సమస్యలతో ఆధారాలు చూపిన వారికి మాత్రం మినహాయింపు ఇచ్చారు. అనంతపురం సర్కిల్ కార్యాలయంలో జేఈఈలు శ్రీనివాసకుమార్, లక్ష్మీదేవిలు ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారిలో ఉన్నారు. శ్రీనివాస కుమార్ సెప్టెంబరులో ఉద్యోగ విరమణ పొందాల్సి ఉండటంతో ఆయనను అక్కడే ఉంచారు. లక్ష్మీదేవిని పెనుకొండకు కేటాయించారు. అదే తరహాలో పీఐయూ సూపరింటెండెంట్ ఐదేళ్లు పూర్తి కావడంలో స్థాన చలనం తప్పలేదు.

ఉమ్మడి జిల్లా బదిలీ వివరాలు

అనంతపురం ఉమ్మడి జిల్లాలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న డీఈఈల్లో నలుగురు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వీరిలో రవీంద్ర కుమార్, భరత్‌ప్రకాష్‌రెడ్డి, మురళీధర్, మధుప్రకాష్ ఉన్నారు. వీరిలో భరత్‌ప్రకాష్‌రెడ్డి ఈ నెలాఖరులో ఉద్యోగ విరమణ పొందుతుండటంతో మినహాయింపు ఇచ్చారు. మిగిలిన ముగ్గురు పలు కేటగిరీల కింద దరఖాస్తు చేసుకోవడంతో స్థాన చలనం లేకుండా జాగ్రత్త పడ్డారు. అదే తరహాలో జేఈఈలు ఏడుగురు ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వీరిలో ముగ్గురు స్థాన చలనం పొందారు. మిగిలిన వారు పలు కేటగిరీల కింద పాత స్థానాల్లోనే ఉండిపోయారు.


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ ఈఎన్‌సీ బాలు నాయక్

ఉన్నత నిర్ణయం..!

ఉన్నత విద్య అభ్యసించిన విద్యార్థులకు తీపికబురు







ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం కసరత్తు

సచివాలయ ఉద్యోగులకు సర్వే బాధ్యతలు

2023-24లో మూడు విడతలు పెండింగ్

అనంతపురం సెంట్రల్, మే 27(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యను కొత్త ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం బకాయి పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బు చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. దీంతో వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చనుంది. గత ప్రభుత్వం బకాయి పెట్టిన వాటిని చెల్లించేందుకు ముందుకు రావడం ఎంతో ఉన్నత నిర్ణయం అని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో మూడు విడతల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఆ మేరకు సర్వేకి సైతం శ్రీకారం చుట్టింది. సర్వే బాధ్యతలను సచివాలయ ఉద్యోగులకు అప్పగించింది.

24 నుంచి సర్వే

కళాశాలకు చెల్లించాల్సిన ఫీజులు, సర్టిఫికెట్లకు సంబంధంలేకుండా ఇప్పటికే విద్యార్థులకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా 2024-25 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, ఐటీఐ, నర్సింగ్ తదితరత కోర్సులు చదివే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేరుగా కళాశాలల ఖాతాలకే జమచేసే పద్ధతి ప్రవేశపెట్టింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వంలో చెల్లించాల్సిన ఫీజు బకాయిలను చెల్లించేలా కసరత్తు చేపట్టింది. 2023-24 విద్యా సంవత్సరానికి సబంధించిన నాలుగు విడతల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో మూడు విడతలను గత ప్రభుత్వం బకాయిపెట్టింది. దీంతో విద్యార్థులే సొంతంగా కళాశాలలకు ఫీజులు కట్టారు. ఇలా 2, 3, 4 విడతలకు సంబంధించిన ఫీజులు కట్టిన విద్యార్థులు ఎంతమంది ఉన్నారు? కళాశాలలకు ఫీజులు చెల్లించినట్లు రసీదులేమైనా పొందారా? ఫీజులుకట్టి బిల్లులు పొందని వారెంతమంది? ఉన్నారన్న అంశాలపై ఈనెల 24వ తేదీ నుంచి (మిగతా 4లో..)

శారదాలో సందడి..!

బదిలీలు.. ప్రమోషన్‌లకు క్యూ

వెరిఫికేషన్‌కు వచ్చిన ఉపాధ్యాయులు


సర్టిఫికెట్లు, ఎస్ఆర్‌లు పరిశీలిస్తున్న స్క్రూటినీ కమిటీ సభ్యులు

అనంతపురం విద్య, మే 27(ఆంధ్రజ్యోతి): బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియతో ఉపాధ్యాయులల్లో సందడి కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియకు అనంతపురం శారదా స్కూల్ వేదిక అయింది. వందలాది మంది టీచర్లు, సంఘాల నేతలతో శాదరా స్కూల్ ప్రాంగణం మంగళవారం కిటకిటలాడింది. గ్రీవెన్సులు, ఫిర్యాదులు, వేకెన్సీలు.. ఇలా అనేక సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు క్యూ కట్టారు. ఉమ్మడి జిల్లాలోని పీఎస్ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ ప్రమోషన్లు ఇచ్చేందుకు మంగళవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్యంలో 3 పోస్టులు, జడ్పీలో 120 పోస్టులు, మున్సిపాలిటీల్లో 20 పోస్టులు, మున్సిపల్ కార్పొరేషన్‌లో 5 పోస్టులకు (ప్రమోషన్ల కోసం) అర్హులైన పీఎస్ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లను 1:3 చొప్పున సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఆహ్వానించారు. ప్రభుత్వ యాజమాన్యంలో ఖాళీగా ఉన్న 3 పోస్టులకు కడపలో వెరిఫికేషన్ నిర్వహించారు. మిగిలిన 145 పోస్టులకు శారదాస్కూల్‌లో 7 కౌంటర్లలో వెరిఫికేషన్ నిర్వహించారు. వెరిఫికేషన్ కమిటీలోని ఏడీలు, సూపరింటెండెంట్లు, మిగతా 4లో

భర్త వెంటే భార్య..

- అనారోగ్యంతో భర్త మృతి
- అంత్యక్రియల రోజునే భార్య కూడా..
- రోదించి.. రోదించి.. ఆగిన గుండె


రామచంద్రారెడ్డి, లక్ష్మీదేవమ్మ (ఫైల్)

ఓబుళదేవరచెరువు, మే27(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలపాటు తనతో కలిసే ఉన్న భర్త మృతిని భార్య భరించలేకపోయింది. భర్త శవాన్ని చూసి రోదించి.. రోదించి.. భార్య గుండె ఆగింది. భర్త అంత్యక్రియల రోజునే ఆమె కూడా మరణించింది. భర్తతో కలిసే వెళ్లిపోయింది. దీంతో దంపతులకు కలిసే అంత్యక్రియలు నిర్వహించారు. మండలంలోని బోయపల్లిలో ఈ ఘటన జరిగింది. గ్రామంలో బెల్లం రామచంద్రారెడ్డి, లక్ష్మీదేవమ్మ దంపతులు నివాసం ఉండేవారు. వీరికి ముగ్గురు కుమారులు. ఇద్దరు ఇంటివద్ద ఉండగా, మూడో కుమారుడు సాంబశివారెడ్డి అమెరికాలో ఉంటున్నారు. రామచంద్రారెడ్డి(80) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. కుమారుడు అమెరికా నుంచి మంగళవారం వచ్చారు. రామచంద్రారెడ్డి మృతదేహాన్ని అలాగే ఉంచారు. తండ్రి మృతదేహాన్ని చూసి ముగ్గురు కుమారులు బాధపడుతుండగా లక్ష్మీదేవమ్మ(70) కన్నీటి పర్యంతమైంది. బోరున విలపించింది. ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. వెంటనే బంధువులు, కుమారులు గమనించగా.. అప్పటికే ఆమె మృతిచెందింది. దంపతుల మృతితో కుమారులతోపాటు బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. దంపతుల మృతదేహాలకు కలిసే అంత్యక్రియలు నిర్వహించారు.


ధర్మవరం ఐసీడీఎస్ కార్యాలయం



కమీషన్ల మేడం...!

ఉద్యోగోన్నతులకు రూ.లక్షల్లో గుంజుడు

- పైసలిస్తేనే బిల్లులపై సంతకాలు
- పోషన్‌బీ.. పడాయిబీలో భారీ దోపిడీ

ధర్మవరం ఐసీడీఎస్‌లో అడుగడుగునా అక్రమాలే

ధర్మవరం, మే 27(ఆంధ్రజ్యోతి): ధర్మవరం ఐసీడీఎస్ కార్యాలయం అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారింది. ఇక్కడ పనిచేసే అధికారిణి అరాచక పర్వంతో కమీషన్ల మేడమంటూ ముద్దుగా పిలుచుకుంటున్నారు. ఉద్యోగోన్నతి, బిల్లు ఏదైనా ఫైల్ ముందుకు కదలాలంటే పైసలిచ్చుకోవాల్సిందే. లేదంటే కొర్రీలు వేస్తూ కాలయాపన చేస్తుంటారు. ఐసీడీఎస్ నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు వివిధ రకాల పౌష్టికాహారంతో పాటు కాయగూరలు, అద్దెలు, సమావేశాల పేరుతో ప్రతినెలా లక్షల్లోనే అక్రమార్జన చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాం నుంచి ఆమె కొనసాగుతున్నారు. ఎవరైనా ఎదిరిస్తే వారికి చుక్కలు చూపిస్తుందని ఆ శాఖలో చెప్పుకుంటున్నారు. అడిగినంత ముడుపులు చెల్లిస్తే అనర్హులకు సైతం ఉద్యోగోన్నతులు కల్పించడంలో ఆమె దిట్ట అని తెలుస్తోంది. ఉద్యోగోన్నతి దక్కాలంటే ఐసీడీఎస్‌లోని కొందరు లీడర్లు రంగ ప్రవేశం చేసి మధ్యవర్తిగా ఉంటూ భారీ ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. ముడుపులు ఇవ్వకపోతే ఎన్నేళ్లయినా అదేపోస్టులో ఉండిపోవాల్సి వస్తుందని భయాందోళనకు గురిచేస్తుండటంతో అప్పులు చేసి అడిగినంత ఇచ్చి ఉద్యోగోన్నతి దక్కించుకునే పరిస్థితి నెలకొంది.

పోషణ్‌బీ.. పడాయిబీలో భారీ అవినీతి

కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంతోపాటు సృజనాత్మకతను వెలికి తీయడానికి పోషణ్‌బీ.. పడాయిబీ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఇద్దరు సూపర్‌వైజర్లతో పాటు సీడీపీఓ హోదాలో ప్రత్యేక శిక్షణ పొంది.. ఆ మెళకువలను స్థానికంగా వర్కర్లు, ఆయాలకు తెలియజేయాలి. ఈ మేరకు ఇటీవల మూడురోజులపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. 250 మందికి శిక్షణ ఇచ్చినట్టు రికార్డుల్లో చూపారు. ఒక్క రోజు భోజనానికి రూ.75వేలు అలా మూడు రోజులకు కలిపి రూ.2.25 లక్షలు, ట్రైనింగ్ మెటీరియల్ కింద (బ్యాగు, పెన్ను, రైటింగ్ ప్యాడ్) కోసం రూ.25వేలు, అంగన్‌వాడీ వర్కర్స్‌కు ఒక్కొక్కరికి రూ.150 చొప్పున కేటాయించారు. టీఏ, డీఏ మాత్రం సక్రమంగా అందజేయగా మిగిలిన అన్నింటిలోనూ భారీగా అవినీతికి పాల్పడినట్టు తెలుస్తోంది. నాసిరకం భోజనాలు ఏర్పాటుచేసి రూ.లక్షల్లో కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సూపర్‌వైజర్లతోనే మూడు రోజుల శిక్షణ ముగించినట్టు ఆరోపణలు ఉన్నాయి.





- లక్ష్మీచెన్నకేశవపురంలో ఓ ఆయా అంగవైకల్యం లేకపోయినా తనకున్న పలుకుబడితో దొంగ సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగోన్నతి పొందినట్టు తెలుస్తోంది. అందుకు గాను మేడంకు సుమారు రూ.5 లక్షల దాకా ముడుపులు అందినట్టు విశ్వసనీయ సమాచారం.
- సంజయ్‌నగర్-1వ కేంద్రంలో ఖాళీ పోస్టుకు నోటిఫికేషన్ వచ్చినా అక్కడ భర్తీ చేయకపోవడం వెనుక అమ్యామ్యాలు ఇవ్వడానికి ఎవరు ముందుకు రాకపోవడమే కాణమని తెలుస్తోంది.
- శారదానగర్‌లో ఓ ఆయా ఉద్యోగోన్నతి వ్యవహారం కోర్టులో ఉంది. మేడంతో ఒప్పందం కుదరడంతో కోర్టులో పెండింగ్ ఉన్నా ఉద్యోగోన్నతి ఇచ్చినట్టు తెలుస్తోంది. దీని వెనుక రూ.లక్షలు చేతులు మారినట్టు ఆ శాఖ ద్వారానే తెలుస్తోంది.
- చిన్నూరు బత్తలపల్లిలో అంగన్‌వాడీ వర్కర్‌పోస్టు ఎస్సీలకు కేటాయించారు. ప్రస్తుతం అక్కడ ఎస్సీ మహిళ పనిచేస్తోంది. సహాయకురాలి పోస్టును బీసీలకు కేటాయించాలని అక్కడ ప్రజలు కోరినప్పటికి.. ఎస్సీలలోనే ఓ వ్యక్తి నుంచి పెద్దమొత్తంలో డబ్బులు తీసుకుని ఆయా పోస్టును కేటాయించినట్టు విమర్శలు ఉన్నాయి.
- రాజేంద్రనగర్ 4వ కేంద్రంలో ఓ ఆయాకు ఉద్యోగోన్నతి ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. డబ్బులు ఇవ్వకపోవడం వల్లే ఇలా చేస్తున్నట్లు తెలుస్తోంది.
- రాంనగర్‌లో ఓ అంగన్‌వాడీ వర్కర్ రాజీనామా చేయగా.. కొన్ని నెలలు పాటు హాజరు చూపించి జీతం నొక్కేసినట్టు తెలుస్తోంది. ఇందులో వర్కర్, మేడం చెరిసగం పంచుకున్నట్టు సమాచారం.
- ఈ ఏడాది ఇచ్చిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా ఇంటర్వ్యూలు నిర్వహించి వర్కర్లు, హెల్పర్లకు జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. కొత్తగా చేరిన ఆయాలు, వర్కర్లు మామూళ్లు ఇవ్వకపోవడంతో ఇప్పటికీ వారు జీతం అందుకోలేని పరిస్థితి నెలకొంది.

మా దృష్టికి రాలేదు

ధర్మవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు మా దృష్టికి రాలేదు. ఎవరైనా రాతపూర్వకంగా ఫిర్యాదుచేస్తే విచారిస్తాం. మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటాను.

-శ్రీదేవి, పీడీ, ఐసీడీఎస్

బాలికలపై వివక్ష రూపుమాపాలి

జిల్లా వైద్యాధికారి ఫైరోజ్‌బేగం

పుట్టపర్తిరూరల్, మే27(ఆంధ్రజ్యోతి): బాలికలపై వివక్ష రూపుమాపాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఫైరోజ్‌బేగం తెలిపారు. జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యులు, సూపర్ వైజర్లతో ఆమె మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. బాలికలపై వివక్ష రూపుమాపేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, అంగన్‌వాడీలను సమన్వయం చేసుకుని గర్భవతులు, ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు.

మార్కెటింగ్ శాఖలో బదిలీలు

అనంతపురం రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖ ఉద్యోగుల బదిలీలు మంగళవారం జరిగాయి. ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 23 మంది, ఐదేళ్లు పూర్తి కాని 22 మంది కలిపి మొత్తం 45 మందిని బదిలీ జాబితాలో చేర్చారు. వీరికి గుంటూరులోని మార్కెటింగ్ శాఖ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం బదిలీల ప్రక్రియ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ఉద్యోగుల బదిలీ ప్రక్రియ మంగళవారం రాత్రి పది గంటలకు పూర్తి అయింది. బదిలీల వివరాలు రెండు మూడురోజుల్లో వెలువడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

శివశక్తి స్వరూపం.. సత్యసాయి..

- అలరించిన నాటిక

పుట్టపర్తి, మే 27(ఆంధ్రజ్యోతి): శివశక్తి స్వరూపం సత్యసాయి అంటూ బాలవికాస్ విద్యార్థులు ప్రదర్శించిన నాటిక భక్తులను మైమరపింపజేసింది. తమిళనాడులోని ఈరోడ్, సేలం జిల్లాలకు చెందిన భక్తులు పర్తియాత్రగా మంగళవారం ప్రశాంతినిలయం చేరుకున్నారు. సాయికుల్వంత్ సభామండపంలో సాయిమధురం పేరిట భక్తిగీతాలు ఆలపించారు. బాలవికాస్ విద్యార్థులు శ్రీసత్యసాయి శివశక్తి స్వరూపం అంటూ నాటికను ప్రదర్శించారు. సత్యసాయి ప్రేమతత్వంపై నాటికతోపాటు నృత్యప్రదర్శన చేపట్టారు. గంటపాటు చిన్నారులు తమ పాటలు, నాటికతో భక్తులను మైమరపింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.




నాటికలోని సన్నివేశాలు

పెళ్లి వద్దనలేక యువతి ఆత్మహత్య



రక్షిత మృతదేహం

అగళి, మే 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన రక్షిత(22) సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ వీరేష్ తెలిపిన మేరకు రక్షిత రొళ్ల మండలం ఎం.రాయాపురం గ్రామానికి చెందిన పునిత్‌ను ప్రేమించింది. ఇరుకుటుంబాల వారు ఒప్పుకుని పెళ్లి చేయాలని నిశ్చయించారు. పునీత్ మద్యం సేవిస్తాడని, చెడు అలవాట్లు ఉన్నాయని తెలుసుకున్న రక్షిత తనలో తాను బాధపడుతూ ఇంట్లో చెప్పలేక, పెళ్లి చేసుకోలేక తీవ్రంగా కుంగిపోయింది. ఈక్రమంలో సోమవారం రాత్రి జీవితంపై విరక్తిచెంది ఇంటిపైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి సన్న బూతన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్యాంకర్స్ పేరుతో బురిడీ 4

విస్తారంగా వర్షాలు

మహానాడు సంబరం



కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.

ఉన్నత నిర్ణయం..!

(3వ పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేపట్టింది. ఏ విద్యార్థీ నష్టపోకుండా వారంరోజుల్లో పూర్తిచేయాలని సర్వే బాధ్యతను సచివాలయ ఉద్యోగులకు అప్పగించింది. దీంతో దాదాపు 42వేల మంది విద్యార్థులు లబ్ధిపొందనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారత శాఖ లెక్కలు చెబుతున్నాయి.



జేఎన్‌టీయూ ముఖద్వారం

నాలుగేళ్లు ఇబ్బందులు..

డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, అగ్రికల్చర్, పాలిటెక్నిక్, ఐటీఐ, నర్సింగ్ ఇలా ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసించే విద్యార్థులకు పోస్ట్‌మెట్రిక్ పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వమే కళాశాలల ఫీజులను రీయింబర్స్ చేస్తుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం ప్రవేశ పెట్టినప్పట్నుంచి కళాశాలల ఖాతాలకే నేరుగా రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుంది. కళాశాలలతో తమకు సంబంధంలేదన్న తరహాలో ఫీజుల అంశాన్ని గత ప్రభుత్వం విద్యార్థులకు ముడిపెట్టింది. ఏడాది ఫీజును నాలుగు విడతలుగా విభజించి విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమచేసేది. దీంతో తల్లుల ఖాతాల్లోకి రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాలను జమచేయకున్నా.. విద్యార్థుల తల్లిదండ్రులే వారి జేబుల నుంచి ఫీజులు చెల్లిస్తూవచ్చారు. పరీక్ష ఫీజులు కట్టించుకోవాలన్నా, హాల్ టిక్కెట్లు ఇవ్వాలన్నా, సర్టిఫికెట్లు ఇవ్వాలన్నా సంబంధిత విద్యార్థి కోర్సు ఫీజు మొత్తాన్ని చెల్లించాల్సి వచ్చేది. ఇలా నాలుగు సంవత్సరాలపాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు.

విద్యార్థులకా.. కళాశాలలకా...

ప్రైవేటు, ప్రభుత్వం అన్న తేడాలేకుండా విద్యార్థుల ముక్కుపిండి కళాశాలల యాజమాన్యాలు ఫీజులు వసూలు చేశాయి. సిఫార్సులున్న కొద్దిమంది విద్యార్థులకు మాత్రమే మినహాయింపు ఇచ్చాయి. అందులోనూ సిఫార్సులు చేసిన వారిని షూరిటీగా పెట్టుకుని ఫలానా తేదీ చెల్లిస్తామని హామీ తీసుకుని వెసులుబాటు కల్పించాయి. దీంతో దాదాపు 90 శాతం మంది విద్యార్థులు సొంతంగా ఫీజులు కట్టుకున్నారు. ఈ క్రమంలో సర్వే అనంతరం మూడు విడుతల బకాయి మొత్తాన్ని విద్యార్థులకు చెల్లించాలా? కళాశాలలకు ఇవ్వాలా? అన్న దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. నివేదికలు వచ్చిన తరువాత విద్యార్థులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటే బాగుంటుందన్న ఆలోచనలో ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రతి విద్యార్థీ సర్వే చేయించుకోవాలి

2023-24లో ఫీజు రీయింబర్స్ మొత్తాలు అందని ప్రతి విద్యార్థీ వీలైనంత త్వరగా సమీపంలోని సచివాలయానికెళ్లి సర్వే చేయించుకోవాలి. ఒకటో విడత ఫీజురీయింబర్స్‌మెంట్ మొత్తాలను చెల్లించారు. మిగిలిన 2, 3, 4 విడతలకు సబంధించిన బకాయిలను చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేపట్టింది. తద్వారా డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, అగ్రికల్చర్, పాలిటెక్నిక్, ఐటీఐ, నర్సింగ్ ఇలా ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసించే దాదాపు 42వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. ఇందుకు కళాశాలకు చెల్లించిన ఫీజు రసీదులను సచివాలయంలో అప్‌లోడ్ చేయించాలి. రసీదులు లేకపోతే కళాశాల నుంచి నోడ్యూ సర్టిఫికెట్ తీసుకుని, అప్‌లోడ్ చేయాలి. సచివాలయ వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీనిగానీ సంక్షేమం, విద్యా సహాయకులను గానీ సంప్రదించాలి.



- రాధిక, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారత అధికారి

సర్వే విధానం..

- 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత ఫీజు రీయింబర్స్‌మెంట్ వివరాలు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం ఉండదు. 2, 3, 4 విడతలకు సబంధించి విద్యార్థుల నుంచి కళాశాల యాజమాన్యం వసూలు చేసిన రుసుముల రసీదులను మాత్రమే అప్‌లోడ్ చేయాలి.
- ఫీజుల రసీదులను విద్యార్థి అందించలేకపోతే కళాశాల నుంచి నో డ్యూ సర్టిఫికెట్ తీసుకుని అప్‌లోడ్ చేయాలి.
- విద్యార్థి ఫీజు వివరాలను సచివాలయ వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీనిగానీ సంక్షేమం, విద్యా సహాయకులుగానీ పరిశీలించాలి.
- ఈ ప్రక్రియ సంబంధిత సచివాలయ ఉద్యోగులు సక్రమంగా పూర్తిచేయవలసి ఉంటుంది. తద్వారా ప్రభుత్వపరంగా ఆడిట్‌గానీ, సాంకేతిక సమస్యలుగానీ తలెత్తవు.

శారదాలో సందడి..!


టీచర్ల సమస్యలపై డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న టీచర్లు, నేతలు

(3వ పేజీ తరువాయి)

ఎంఈఓ, డీఈఓ ఆఫీస్ స్టాఫ్ స్క్రూటినీ చేశారు.

దరఖాస్తు చేయని 376 మంది ఎస్‌జీటీలు

ఎనిమిదేళ్లు ఒకే చోట పనిచేసిన టీచర్లు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంది. ఈ జాబితాలోని ఎస్‌జీటీలు బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు మంగళవారం ఆఖరి రోజు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 376 మంది ఎస్‌జీటీలు దరఖాస్తు చేయలేదు. రాయలసీమ జోన్‌లో ఇతర జిల్లాల్లో దరఖాస్తు చేయని ఎస్‌జీటీలు 100లోపు ఉంటే, అనంతపురంలో ఏకంగా 376 మంది ఉన్నారు. కంపల్సరీ బదిలీ టీచర్లు తప్పనిసరిగా దరఖాస్తు చేయాలని ఆర్‌జేడీ శామ్యూల్, డీఈఓ ప్రసాద్‌బాబు హెచ్చరిస్తున్నా కొందరు టీచర్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

విస్తారంగా వర్షాలు

బుక్కరాయసముద్రం, మే 27(ఆన్‌లైన్): నైరుతి రుతు పవనాల ప్రభావం, అల్పపీడన ద్రోణి కారణంగా ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి మంగళవారం తెలిపారు. తేలికపాటి నుంచి 12 మి.మీ. వరకు వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. గాలి వేగం 16 కి.మీ. నుంచి 20 కి.మీ. ఉంటుందని తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 29.2 డిగ్రీల సెల్సియస్ నుంచి 31.2 డిగ్రీల సెల్సియస్ నమోదవుతాయని తెలిపారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంటలకు మందులు పిచికారీ చేయవద్దని సూచించారు.

16 మండలాల్లో..

అనంతపురం అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 16 మండలాల్లో సోమవారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా యాడికిలో 19.0 మి.మీ., వర్షపాతం నమోదైంది. గుత్తి 17.0, పెద్దవడుగూరు 7.8, తాడిపత్రి 6.4, పామిడి 4.6, గుంతకల్లు, పెద్దపప్పూరు 4.2, కుందుర్పి 3.6, కళ్యాణదుర్గం 3.4, డి. హిరేహాళ్ 3.0, ఉరవకొండ 2.2 మి.మీ., వర్షపాతం కురిసింది. మిగతా మండలాల్లో 1.8 మి.మీ., లోపు నమోదైంది.

బ్యాంకర్స్ పేరుతో బురిడీ

గార్లదిన్నె, మే 27(ఆంధ్రజ్యోతి): తాము బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, మీకు ముద్ర రుణం రూ.2 లక్షలు మంజూరు చేస్తాం. ప్రస్తుతం మీరు రూ.33వేలు ఈ నెంబరుకు ఫోన్‌పే చేయండి అని మోసగించిన ఉదంతం మండలంలో జరిగింది. గార్లదిన్నెలో హోటల్ నిర్వహిస్తున్న ఓ మహిళాకు ఈనెల 23న మధ్యాహ్నం ఓ నెంబరు నుంచి ఫోన్ వచ్చింది. తాము బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం. మీరు ముద్ర రుణం పొందడానికి అర్హులయ్యారని నమ్మించారు. దీంతో ఆశ పడిన ఆ మహిళా రుణం ఎప్పుడు మంజూరు చేస్తారు సార్ అని అడిగారు. ముద్ర రుణం మంజూరు చేయాలంటే కొంత ప్రాసెస్ ఉంది.. ప్రాసెస్ చేయాలంటే కొంత ఖర్చు అవుతుందన్నారు. ముద్రరుణం మంజూరు చేయాలంటే డిపాజిట్ రూ.10వేలు, బీమా రూ. 10వేలు, బాండు ఫీజు రూ. 3వేలు ఖర్చు అవుతుంది. మా నెంబరుకు ఫోన్‌పే చేస్తే వెంటనే ముద్ర రుణం మంజూరు చేసి, మీ ఖాతాలోకి జమ చేస్తామని నమ్మించారు. వారి మాటలను నమ్మిన మహిళా వెంటనే వారు చెప్పిన నెంబరుకు ఫోన్‌పే చేసింది. మీకు రూ.2 లక్షలు మంజూరు చేస్తున్నాం. మాకు కమీషన్ కింద రూ. 10వేలు ఇవ్వాలన్నారు. సరే అని మరో రూ.10వేలు మొత్తం రూ. 33వేలు ఫోన్‌పే చేశారు. తర్వాత వారు బ్యాంకు సమయం అయిపోయింది. సోమవారం మీ ఖాతాలోకి డబ్బులు జమ చేస్తామని చెప్పారు. దీంతో బాధిత మహిళ సోమవారం బ్యాంకుకు వెళ్లి చూడగా ఎలాంటి డబ్బు జమకాలేదు. దీంతో తనకు ఫోన్ చేసిన నెంబరుకు ఫోన్‌చేయగా అది పనిచేయలేదు. దీంతో తాను మోసపోయానని బాధిత మహిళ బోరుమని విలపించింది.

ప్రతి రైతుకూ ఐదు బస్తాల విత్తనాలు ఇవ్వాలి

ఓబుళదేవరచెరువు, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రతిరైతుకు సబ్సిడీ వేరుశనగ కాయలు ఐదు బస్తాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందచేశారు. అనంతరం సీపీఐ నాయకుడు చలపతినాయుడు మాట్లాడుతూ.. తొలకరి వర్షంతో రైతులు వ్యవసాయం సాగుచేయడానికి సిద్ధమవుతున్నారని, వెంటనే సబ్సిడీ విత్తనకాయలు అందించాలని అన్నారు. ప్రతిరైతుకు ఐదుబస్తాల విత్తనాలతోపాటు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయడానికి ఉలవ, కంది, తదితర విత్తనాలు అందించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పూల శ్రీనివాసులు, రత్నాబాయి, రవికుమార్, రామచంద్ర, యల్లప్ప పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకరణ

కదిరి, మే 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా ఇటీవల ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్‌షాద్‌దున్నిషా, వైస్‌చైర్మన్లు సుధారాణి, రాజశేఖరాచారు బుధవారం పదవి బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరవుతాయరని, కౌన్సిలర్లు అందరూ హాజరు కావాలని కోరారు.

నూజివీడులో ట్రిపుల్ ఐటీ సీటు


పవన్

ధర్మవరం, మే 27(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ కోటాలో ధర్మవరం మండలం గొట్లూరు గ్రామానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు పవన్‌కుమార్ నూజివీడు ట్రిపుల్ ఐటీ సీటు సాధించినట్టు కబడ్డీ కోచ్ పృథ్వీ తెలిపారు. పవన్ మూడేళ్లగా ఆర్డీటీ క్రీడామైదానంలో సాధన చేస్తూ రెండుసార్లు జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటారన్నారు. అతను గొట్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతూ ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 491 మార్కులు సాధించాడన్నారు. స్పోర్ట్స్ కోటాలో ట్రిపుల్ ఐటీ సీటు సాధించారన్నారు.

గంగమ్మకు బోనాలు, జ్యోతులు



గాండ్లపెంట,మే27(ఆంధ్రజ్యోతి): స్థానిక గంగా భవాని అమ్మవారికి భక్తులు మంగళవారం జ్యోతులు, బోనాలు సమర్పించారు. అమ్మవారికి పూజలు చేయించి.. మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం

కొత్తచెరువు, మే 27(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా నాయనపల్లి క్రాస్ నుంచి బత్తలపల్లి, ధర్మవరం మీదుగా కోడూరు తోపు వరకు నాలుగు లైన్ల రోడ్డు వేయనున్నారు. దీంతో ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న భవనాలకు రెవెన్యూ అధికారులు రెండు రోజుల నుంచి సర్వే నిర్వహించి మార్కింగ్‌ను వేస్తున్నారు. దీంతో పుట్టపర్తి ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న భవనాలు చాలావరకు రోడ్డు విస్తరణలో పోనున్నాయి.

సచివాలయం తనిఖీ

బత్తలపల్లి, మే 27(ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయం-1ను జిల్లా జనన మరణాల రిజిస్ట్రేషన్ అధికారి ఖలందర్ మంగళవారం తనిఖీ చేశారు. ఇక్కడ ఆర్డీటీ ఆసుపత్రి ఉన్నందున జనన మరణాలు ఎక్కువగా ఉంటాయని, వాటి ధ్రువీకరణ పత్రాలను జాగ్రత్తగా పరిశీలించి.. మంజూరు చేయాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి ఉన్నారు.

ప్రైవేటు వ్యక్తులకు సమాచారం ఇవ్వకండి

నంబులపూలకుంట, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎవరైనా ప్రైవేటు వ్యక్తులు భూములు వాటి వివరాలను అడిగితే ఇవ్వరాదని తహసీల్దార్ దేవేంద్రనాయక్ మంగళవారం సూచించారు. పరిశ్రమలు పెడుతున్నామంటూ కొందరు వ్యక్తులు రైతుల నుంచి భూముల వివరాలు సేకరిస్తున్నారని, అలాంటి వారి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

పరిహారం ఇచ్చాకే రోడ్డు పనులు చేపట్టాలి

ముదిగుబ్బ, మే 27(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి జాతీయ రహదారి (342) నిర్మాణంలో భూములు కోల్పోయిన తమకు పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు చేపట్టాలని బాధిత రైతులు తేల్చిచెప్పారు. ఈ మేరకు మండలంలోని దొరిగల్లు రోడ్డు సమీపంలో జరుగుతున్న జాతీయ రహదారి పనులను రెండో రోజైన మంగళవారమూ అడ్డుకున్నారు. రోడ్డు విస్తరణలో రూ. కోట్ల విలువ చేసే భూములు కోల్పోతున్నామని, రిజిస్ట్రేషన్ వాల్యూ ప్రకారం న్యాయమైన పరిహారం ఇవ్వాలని, లేకపోతే భూములు ఇచ్చే ప్రశక్తే లేదని అన్నారు. కనీసం గ్రామ సభలు నిర్వహించకుండా, రైతులకు పరిహారం ఎంత ఇస్తారో తెలపకుండా పనులు చేపట్టడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో బాధితులు సోమల ప్రకాష్, సనత్ కుమార్ విశ్వనాథ్, ప్రభాకర్, హనుమంతు, ప్రసాద్, జయచంద్ర పాల్గొన్నారు.

భూసేకరణ పనులు సత్వరం పూర్తిచేయాలి: కలెక్టర్

పుట్టపర్తిటౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జాతీయ రహదారుల నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణ పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో ఎన్‌హెచ్ 342, 716జి, భూసేకరణ పనులు పురోగతిపై జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఏదైన సమస్యలుంటే జాతీయ రహదారుల అథారటీ అధికారులు, సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్లను సమన్వయం చేసుకుని త్వరగా పరిష్కరించుకోవాలని సూచించారు.

1న కంటి వైద్యశిబిరం

ధర్మవరం, మే 27(ఆంధ్రజ్యోతి): స్థానిక స్వాతి క్లినిక్‌లో జూన్ 1న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శీలా నాగేంద్ర, జయరాం మంగళవారం తెలిపారు. ధర్మవ రం, చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హామీలు అమలు చేయాలి

నల్లమాడ, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం నాయకులు మంగళవారం తహసీల్దార్ రంగ నాయకులకు వినతిపత్రం అందించారు. సీపీఎం మండల నాయకుడు గోవిందు మాట్లాడుతూ.. రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందజేయాలని, సబ్సిడీ విత్తనకాయలు, 50 సంవత్సరాల పైబడిన బిసికు పించన్, 18 సంవత్సరాలు నిండిన మహిళలు నెలకు రూ.1500, తల్లికి వందనం హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో గోపాల్ నాయుడు, జనార్ధన్, నాగేష్, వెంకటరాముడు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల భిక్షాటన

గాండ్లపెంట, మే 27(ఆంధ్రజ్యోతి): తమకు బకాయి ఉన్న 20 నెలల జీతాలు వెంటనే చెల్లించాలని గాండ్లపెంటలో పారిశుధ్య కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారానికి పదో రోజుకు చేరుకున్నాయి. ఈ మేరకు వారు మండల కేంద్రంలోని పలు దుకాణాలు, ఇళ్ల వద్దకు వెళ్లి భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు.

● కంప్యూటర్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలి: ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. అతను ప్రతి పనికి డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని, ఎంపీడీఓ కార్యాలయంలో ఇలా అక్రమాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాజారెడ్డి, ఆనంద్, బాబ్‌జాన్, పారిశుధ్య కార్మికులు అక్కులప్ప, నరసింహ కదిరప్ప, దొడ్డెప్ప, అంజి పాల్గొన్నారు.


కాళీబిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

తాగునీటి కోసం మహిళల నిరసన

పుట్టపర్తి, మే 27(ఆంధ్రజ్యోతి): తాగునీరు లేక వారం రోజులుగా ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోలేదని మున్సిపాల్టీ పరిధిలోని కుమ్మరపేటకు చెందిన మహిళలు మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఆ కాలనీలో కాళీబిందెలతో నిరసన వ్యక్తం చేశారు. తరచూ కాలనీలో తాగునీటి సమస్య తలెత్తుతున్నా సిబ్బంది పట్టించుకోలేదన్నారు. వారం క్రితం ఉన్న ఒక్క మోటారు కాలిపోయిందని, ఇంతవరకు దానికి మరమ్మతులు చేపట్టలేదని అన్నారు. సమస్య పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సుబ్బలక్ష్మీ, శ్రీదేవి, ఉషారాణి, రజిత, సరాబి పాల్గొన్నారు.

యోగాపై అవగాహన ర్యాలీ

పుట్టపర్తిరూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఆర్డీఓ సువర్ణ ఆధ్వర్యంలో అవగాహన మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఇందులో డీఆర్‌డీఏ, మున్సిపల్, మెప్మా శాఖల అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం ఆరు గంటల నుండి ఎనిమిది గంటల వరకు విద్యాగిరి రోడ్డుపై పర్యాటక యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ బాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విధులకు సచివాలయ ఉద్యోగుల డుమ్మా


క్రికెట్ టోర్నీలో తిప్పారెడ్డి

గాండ్లపెంట, మే 27(ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయంలోని పలువురు ఉద్యోగులు విధులను నిర్లక్ష్యం చేస్తున్నారు. రెండు రోజులుగా వారు కేవలం ముఖహాజరు అయినట్లు చూపి.. హాజరు పట్టికలో సంతకాలు కూడా చేయకుండా.. విధులకు డుమ్మా కొట్టి వెళ్తున్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ తిప్పారెడ్డి మంగళవారం విధులకు వచ్చినట్లు ముఖహాజరు వేసి.. రిజిస్టర్‌లో సంతకం కూడా చేయకుండా విధులకు డుమ్మా కొట్టి.. మండలంలోని కత్తివారిపల్లిలో జరుగుతున్న క్రికెట్ టోర్నీలో పాల్గొన్నాడు. దీనిపై పంచాయతీ కార్యదర్శి బాషాను వివరణ కోరగా.. ఇంజనీర్ అసిస్టెంట్ తిప్పారెడ్డి మంగళవారం సెలవు పెట్టలేదని, విధులకు కూడా హాజరు కాలేదని, దీనిపై అతన్ని వివరణ కోరినట్లు చెప్పారు. ఎంపీడీఓ వెంకటరామిరెడ్డిని వివరణ కోరగా సచివాలయ ఉద్యోగిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

రాక్ గార్డెన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ధర్మవరం, మే 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోతుకుంట కాలనీలో రాక్ గార్డెన్ ఏర్పాటుకు అధికారులు స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఏపీ మెడికల్ అండ్ ఆరోమాటిక్ ప్లాంట్స్ బోర్డ్ సీఈఓ చంద్రశేఖర్, ఆర్డీఓ మహేశ్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు ఆ స్థలాన్ని పరిశీలించారు.

30న అహల్యాబాయి హోల్కర్ జయంతి

ధర్మవరం, మే 27(ఆంధ్రజ్యోతి): పవిత్రమూర్తి, ప్రజాహితైషిణి అహల్యాబాయి హోల్కర్ 300 జయంతి ఉత్సవాలను శుక్రవారం పట్టణంలో నిర్వహిస్తున్నట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాలను స్థానిక బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విడుదల చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


నరసింహుడు (ఫైల్)

కొత్తచెరువు, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని లోచర్ల చెరువుకట్ట మలుపులో మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో లోచర్ల సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు నరసింహుడు (50) మరణించాడు. కొత్తచెరువు నుంచి స్కూటర్‌లో లోచర్లకు బయలుదేరాడు. మార్గమధ్యలో స్కూటర్ అదుపుతప్పి.. కింద పడి.. తీవ్రంగా గాయపడ్డాడు. కొత్తచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మరణించాడు. నరసింహుడికి భార్య భాగ్యమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కేసు దర్యాప్తులో ఉందని కొత్తచెరువు అప్ గ్రేడ్ ఇన్‌చార్జి సీఐ సురేష్ తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

ధర్మవరం, మే 27(ఆంధ్రజ్యోతి): అప్పుగా ఇచ్చిన డబ్బులు ఇవ్వకుండా తనను బెదిరిస్తున్నారని పట్టణంలోని గీతానగర్‌కు చెందిన నాగేంద్రబాబు, అతని తల్లి రామకృష్ణమ్మపై అదే ప్రాంతవాసి చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చంద్రశేఖర్ వద్ద పి.సురేశ్‌నాయుడు, బి.నాగేంద్రబాబు రూ.10 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అంతేకాకుండా వారిపేరు మీద ఉన్న ఇంటిని చంద్రశేఖర్ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారు. డబ్బును వడ్డీతో సకాలంలో చెల్లించి తమ ఇంటిని తిరిగి రిజిస్ట్రేషన్ చేయిం చుకుంటామని, డబ్బులు చెల్లించకపోతే ఆ ఇల్లు చంద్రశేఖర్‌కే చెల్లుతుందని అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే అగ్రిమెంట్ గడువు ముగిసినా డబ్బులు ఇవ్వలేదు. నాగేంద్రబాబు, అతని తల్లి రామ కృష్ణమ్మ అగ్రిమెంట్ ప్రకారం ఇంటిని ఖాళీ చేయకుండా డబ్బులు ఇవ్వకుండా చంద్రశేఖర్‌ను ఇబ్బందులు పెట్టేవారు. డబ్బులు అడిగి తే అంతు చూస్తామని బెదిరింపులకు దిగేవారు. దీంతో చంద్రశేఖర్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

అవినీతిపై విచారణ చేయించండి

ధర్మవరం, మే 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవపురంలోని 650-2 సర్వేనెంబరులో జరిగిన భారీ అవినీతి, అక్రమాలపై విచారణ చేయించాలని సీపీఐ జిల్లాకార్యదర్శి వేమయ్య యాదవ్,నియోజకవర్గ కార్యదర్శి ముసుగుమధు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ప్లంబర్స్ అసోషియేషన్, కార్మికసంఘం నాయకులతో కలిసి ఆర్డీఓ మహేశ్, తహసీల్దార్ నటరాజ్‌కు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ.. రూ.60 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని పేదల పేర్లు చెప్పుకుని ప్లంబర్స్ యూనియన్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కుమ్మక్కై బినామీ పేర్లతో కాజేశారన్నారు. వీరి అవినీతికి అప్పటి తహసీల్దార్ రమేశ్ పూర్తిగా సహకరించారన్నారు. ప్లంబర్స్ యూనియన్ మాటున రాజు, సురేంద్ర, లతీఫ్ తమ బంధువుల పేర్లతో బినామి పట్టాలు పొంది దాదాపు రూ.30కోట్లు విలువైన భూమిని దోచేశారన్నారు. ఇలాంటి అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని, అర్హులకు పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ, తహసీల్దార్‌ను కోరారు. దీనికి ఆర్డీఓ మాట్లాడుతూ.. పూర్తి విచారణ చేసి.. అనర్హులను తొలగించి.. అర్హులకు పట్టాలు అందేలా చేస్తామని హామీ ఇచ్చారు.

గుడిలో చోరీ కేసులో ఆరునెలల జైలు


రామ్మోహన్

పూతలపట్టు, మే 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలోని బంగారుపాళ్యం మండలం నలగాంపల్లె పంచాయతీ పాపదేశివారికండ్రిగ గ్రామంలో వినాయక స్వామి గుడిలో 2023 మార్చి 31న చోరీ జరిగింది. హుండీని పగులగొట్టి అందులోని రూ.2వేలను చోరీ చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన రామ్మోహన్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్టు చేశారు. ఈ కేసు మంగళవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో వాయిదాకు రాగా, న్యాయమూర్తి ఉమాదేవి పూర్వాపరాలు పరిశీలించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి ఆరునెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.



కడపలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి మహానాడుకు వచ్చిన అతిథులు, కార్యకర్తలకు సంబంధించిన భోజన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిటీ సభ్యుడు, ఎంపీ బీకే పార్థసారథి



మహానాడుకు తరలివెళ్లిన పెనుకొండ టీడీపీ నాయకులు

వడిసలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మడకశిర టౌన్, మే27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన వడిసలమ్మ ఆలయంలో అమ్మవారికి మంగళవారం విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకుపూజ అలంకరణ, ప్రాకారోత్సవం, విశేష అర్చనలు, అభిషేకాలు చేశారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

శనైశ్చరుడికి తైలాభిషేకం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

అమరాపురం, మే 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శనైశ్వర ఆలయంలో వైభవంగా పూజలు నిర్వహించారు. విశ్వావసు నామసంవత్సరం వైశాఖ మాసం మంగళవారం ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, తైలాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. వివిధ పూలతో స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలను ప్రధాన అర్చకులు నరసింహబట్టార్, హరీష్‌బట్టార్ జరిపించారు. అనంతరం మహామంగళహారతి తీర్థప్రసాద వినియోగంగావించారు. ఈ సందర్భంగా సాయంత్రం స్వామివారి ఉయ్యాలోత్సవం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకోండి

మడకశిర రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): డ్రిప్, స్ప్రింక్లర్లు కావాల్సిన రైతులు సమీప రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎంఐపీ మడకశిర డివిజన్ ఇన్‌చార్జి నరసంహప్ప తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 100శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 90 శాతం సబ్సిడీతో అందిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు, వన్ బీ, పొలం చెక్కుబంది సర్టిఫికేట్, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకాలు జిరాక్స్ కాపీలతో రైతుసేవా కేంద్రాల్లో రైతులు సంప్రదించాలని కోరారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

మడకశిర టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): మడకశిర సమీపంలోని కర్ణాటక ప్రాంతం దొమ్మతిమర్రి గ్రామంలోని రామకృష్ణ మఠంలో జూన్ 1న చర్మవ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రఘునందన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు మాత్రమే శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యోగాతో ఆరోగ్యం

పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్

పెనుకొండ, మే27(ఆంధ్రజ్యోతి): సర్వరోగ నివారిణి యోగా అని, ప్రతి ఒక్కరూ యోగా సాధన చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో యోగా తరగతుల నిర్వహణపై సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెనుకొండ నగర పంచాయతీలోని అన్ని సచివాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ ఉదయం 6-30నుంచి 7-30వరకు యోగా తరగతులు నిర్వహించాలన్నారు. యోగాపై ప్రజలకు అవగాహన కల్పించి తరగతుల్లో పాల్గొనే విధంగా చూడాలన్నారు. సమావేశంలో మేనేజర్ వెంకటరమణ, ఆర్‌ఓ దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: యోగాతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీఓ కేశవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన గుడిబండలో యోగాపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం యోగా శిక్షణను నిర్వహిస్తుందని ప్రజలు ప్రతిరోజూ ఉదయం జిల్లాపరిషత్ పాఠశాలలో యోగా సాధన చేయవచ్చన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి బస్టాండులో మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఓ గంగాధర్, డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజునాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



గుడిబండ బస్టాండులో మానవహారం

పురంపర...!

- ఎన్టీఆర్‌కు హిందూపురంతో విడదీయని బంధం
- సీఎంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు
- ఏడుసార్లు నందమూరి కుటుంబానికే పట్టం
- 'అన్న' వారసత్వాన్ని కొనసాగిస్తున్న వారసులు
- నేడు నందమూరి తారకరామారావు జయంతి



ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత సీసీ నుంచి డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న నందమూరి తారకరామారావు (ఫైల్)



పురంలో నాలుగు సింహాల ఎన్టీఆర్ విగ్రహం

హిందూపురం, మే 27: ఏళ్లు గడిచినా తరగని అభిమానం ఆయనకే సొంతం. భౌతికంగా ఆయన లేకపోయినా రైతులు, పేద, బడుగు, బలహీన వర్గాల్లో ఆయన రూపం శాశ్వతం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేసినా హిందూపురం అంటే ఆయనకు అభిమానం. ఇక్కడి ప్రజలకు ఆయనంటే ప్రాణం. ఈ నియోజకవర్గం నుంచే పలు మార్లు ఎమ్మెల్యేగా గెలిచి సీఎం పీఠాన్ని అధిరోహించారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం పరితపించారు. ఆక్రమంలో ఎన్నో చిరస్థాయిగా నిలిచే పనులు చేశారు. ఆయనే తెలుగు ప్రజలు అభిమానంగా అన్నా అని పిలుచుకునే దివంగత నందమూరి తారకరామారావు. ఆయన అస్తమయం తర్వాత కూడా ఆయన వారసులు హిందూపురం నుంచే ఎమ్మెల్యేలుగా ప్రాతినిథ్యం వహించి, అభివృద్ధి కార్యక్రమాలతో తండ్రి పరంపరను కొనసాగిస్తూ నియోజకవర్గాన్ని నందమూరిపురంగా మార్చారు. బుధవారం దివంగత ఎన్టీఆర్ జయంతి. ఈ సందర్భంగా హిందూపురం, ఉమ్మడి జిల్లాతో ఆయన అనుబంధం గురించి...

ఎన్టీఆర్ ఆలోచనే హంద్రీనీవా ...

కరువు ప్రాంతమైన ఉమ్మడి జిల్లాకు సాగు, తాగునీరు అందించాలని ఎన్టీఆర్ తలంచారు. ఆ తలపుల్లోంచి పురుడు పోసుకున్నదే హంద్రీనీవా ప్రాజెక్టు. కృష్ణాజలాలను శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీనీవా ద్వారా జిల్లాకు తరలించే పనులకు ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే శ్రీకారం చుట్టారు. ఆయన చూపిన మార్గాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనసాగించడం వల్లే జిల్లాకు ప్రసిద్ధి చెందిన కార్ల పరిశ్రమ కియ వచ్చింది. అలాగే హిందూపురం మండలం తూమకుంట పారిశ్రామికవాడకు నీటిని అందించగలుగుతున్నారు. జిల్లా పారిశ్రామిక కారిడార్‌గా మారబోతోందంటే ఆరోజు ఎన్టీఆర్ వేసిన పునాదేనని తెలుగుతమ్ముళ్లు చెబుతున్నారు.

అల్లుకున్న బంధం

నందమూరి కుటుంబానికి హిందూపురంతో విడదీయరాని బంధం అల్లుకుంది. దివంగత ఎన్టీ రామారావు ఇక్కడి నుంచే మూడుసార్లు పోటీచేసి తిరుగులేని విజయాన్ని సాధించి రెండుమార్లు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గం అభివృద్ధి కోసం లేపాక్షిలో నవోదయ, ఏపీఆర్ఎస్, మలుగూరు, కొడిగెనహళ్లిలో ఏపీఆర్ఎస్ పాఠశాల స్థాపించి నిరుపేద పిల్లలకు మెరుగైన విద్య, వసతి అందించారు. నిరుద్యోగ సమస్య తీర్చాలనే ఉద్దేశ్యంతో తూమకుంట పారిశ్రామికవాడలో పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టగా నేడు భారీ పారిశ్రామిక వాడగా గుర్తింపు వచ్చింది. ఎంజీఎం క్రీడామైదానంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసింది కూడా ఎన్టీఆరే. హిందూపురంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా మార్చి, స్థానిక ఎమ్మెల్యేనే చైర్మన్‌గా ఉండాలని ప్రత్యేక జీఓను తెచ్చారంటే ఈ నియోజకవర్గంపై ఎంత మక్కువ ఉందో అర్థం అవుతోంది. నియోజకవర్గంలో మారుమూల గ్రామాలకు సైతం ఇళ్లు, రోడ్లు నిర్మించినది సైతం ఎన్టీఆరే.

వారసులు సైతం

ఎన్టీఆర్ మరణానంతరం ఆయన తనయుడు హరికృష్ణ ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై కార్మిక శాఖ మంత్రి బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం నందమూరి బాలకృష్ణను కూడా ఈ నియోజకవర్గం నుంచే మూడోసారి ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు. బాలకృష్ణ పాల్గొనే సమావేశాల్లో ప్రతిసారి ఈ నియోజకవర్గం నందమూరి వంశానికి రాజకీయ పుట్టినిల్లంటూ చెబుతుంటారు. ఈ నేపథ్యంలో ఈ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేయడానికి శ్రీకారం చుట్టారు. దశాబ్దాల కాలంగా వెంటాడుతున్న నీటి సమస్యను పరిష్కరించేందుకు సంకల్పించారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి రూ.194కోట్లతో పురానికి నీటిని తీసుకొచ్చారు. 2014నుంచి 2019వరకు అన్నిరకాల అభివృద్ధి సంక్షేమ పథకాల కోసం రూ. 2వేల కోట్లకుపైగా నిధులు ఖర్చు చేశారు. ప్రస్తుం కూడా వివిధ అభివృద్ధి పనులకు రూ.200కోట్లుకుపైగా నిధులు మంజూరుకాగా వీటిలో రూ.50కోట్ల పనులు పూర్తయ్యాయి. మరో రూ.300కోట్లు నిధులు విడుదలకు సిద్ధంగా ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నారు.

ప్రత్యేక అధికారిగా ఐఏఎస్

నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ప్రత్యేక అధికారిగా ఐఏఎస్ అధికారిని నియమించారు. తాను ఎక్కడున్నా నియోజకవర్గంలో అభివృద్ధి ఆగకూడదంటూ అప్పట్లో ఐఏఎస్ అధికారిని ఆదేశించారు. ప్రతిరోజూ ఉదయం హిందూపురం నియోజకవర్గ అభివృద్ధి సంబంధించి ప్రత్యేక అధికారితోపాటు నియోజకవర్గ ముఖ్య నాయకులను ఫోన్‌లో సంప్రదించేవారని ఇప్పటికీ చెబుతున్నారు. సీఎంగా ఉన్నా తరచూ హిందూపురం నియోజకవర్గంలో పర్యటించే వారు. ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నా ఒక రాత్రి హిందూపురంలోని నందమూరినగర్‌వద్ద గురుకుల పాఠశాలలో నిద్రించేవారు. ఆయన సీఎంగా ఉంటూ హిందూపురానికి వచ్చినప్పుడు నియోజకవర్గంలోని అధికారులతో అభివృద్ధి, ఇతరత్ర వాటిపై సమీక్ష జరిపేవారని అప్పట్లో ఎన్టీఆర్‌కు దగ్గరగా ఉన్న మాజీ ఎమ్మెల్యే సీసీ వెంకటరాముడు తరచూ చెబుతుంటారు.

నేడు ఎన్టీఆర్ జయంతి

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 10గంటలకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి జయంతి వేడుకలు జరుపనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. దీనికి టీడీపీ, నందమూరి అభిమానులు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు.

మడకశిరలో మోస్తరు వర్షం



మడకశిరలో కురుస్తున్న వర్షం, పురంలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

మడకశిర టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం ఓ మోస్తారు వర్షం కురిసింది. పది రోజుల నుంచి ఓ మోస్తరుగా వర్షం పడుతూనే ఉంది. దీంతో ఇళ్ల మధ్యకు వర్షం నీరు చేరింది. ఈ ఏడాది వర్షం మే నుంచి కురుస్తుండటంతో రైతులు భూమిని దుక్కి దున్నే పనులకు సిద్ధం అవుతున్నారు, గత ఏడాది వర్షాలు లేక పంటలు సరిగా పండక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈఏడాది అయినా లాభాలు సాధించాలన్న కృతనిశ్చయంతో పంటను సాగు చేసేందుకు రైతులు సిద్ధం చేసుకొంటున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే విత్తన వేరుశనగ కోసం ఎదురుచూస్తున్నారు.

హిందూపుం(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో హిందూపురంలో మంగళవారం పలుసార్లు చిరుజల్లులు కురిసాయి. రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. మొన్నటివరకు ఉష్ణోగ్రతలు 37డిగ్రీల దాకా నమోదయ్యాయి. అలాంటిది ఒక్కసారిగా పడిపోయాయి. మంగళవారం 28డిగ్రీలు నమోదైంది. రాత్రిపూట 23డిగ్రీలకు పడిపోయిం ది. దీంతో మొన్నటి దాకా ఉక్కపోతతో అల్లాడిన చల్లటి గాలికి సేదతీరుతున్నారు.

బహిరంగ సభ పోస్టర్ల విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

హిందూపురం, మే 27(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కృష్ణానది సంగమేశ్వర వద్ద ఈనెల 31న జరిగే బహిరంగ సభ పోస్టర్లను మంగళవారం జలసాధనమితి నాయకులు హిందూపురంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఓపీడీఎస్ శ్రీనివాసులు, గంగిరెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్ట్ పూర్తిగా రాయలసీమ తాగు, సాగునీటికే వినియోగించాలన్నారు. కృష్ణానది యాజమాన్యం బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలన్నారు. యువత భవితకు విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని ప్రత్యేక ప్యాకేజీ కడప ఉక్కు జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావాలన్నారు. వ్యవసాయ విశ్వ విద్యాలయం, హైకోర్టు సీమలోనే ఏర్పాటు చేయాలన్నారు. హంద్రీనీవా తెలుగుగంగా, గాలేరు, నగరి, వెలిగొండ ప్రాజెక్టులు మూడు సంవత్సరాల్లో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పుల్లప్ప, లోకేష్, వైసీపీ నాయకులు రామ్మూర్తి, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆజంనేయులు, రంగనాయకులు, జమీల్, గంగాధర్, నవీన్ పాల్గొన్నారు.

ఘనంగా అహల్యాబాయి హోల్కర్ జయంతి

గోరంట్ల, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మయ్యగారిపల్లి మారెమ్మ ఆలయంలో అహల్యాబాయి హోల్కర్ జయంతిని బీజేపీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అహల్యాబాయి హోల్కర్ 1725లో మహారాష్ట్రలోని చోండి గ్రామంలో జన్మించి 1767 నుంచి 1795 వరకు మరాఠి రాజ్యాన్ని పరిపాలిస్తూ అనేక హిందూ దేవాలయాను నిర్మించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలకన్వీనర్ బోయ లక్ష్మీనారాయణ, పరిగి వేణుగోపాలస్వామి, అర్చకులు దేవరాజుస్వామి, బొట్టు శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జయంతికి తరలిరండి

హిందూపురం, మే 27(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి. టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు జయంతి బుధవారం జరుగనుందని కార్యకర్తలు తరలిరావాలలని మున్సిపల్ చైర్మన్ రమేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించనున్నారు. అదేవిధంగా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ ఉంటుందన్నారు. నాలుగు సింహాల ఎన్టీఆర్ సర్కిల్‌లో మున్సిపల్ పారిశుధ్య మహిళా కార్మికులకు చీరల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు.

రొద్దం నుంచి మహానాడుకు సైకిల్‌యాత్ర



రొద్దం నుంచి సైకిల్‌యాత్ర ప్రారంభిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): మహానాడుకు రొద్దంలోని బీసీ సెల్ జిల్లా కార్యదర్శి వీరాంజనేయులు ఆధ్వర్యంలో పలువురు యువకులు సైకిల్‌యాత్ర చేపట్టారు. మంగళవారం రొద్దం మండలం నుంచి దాదాపు 15మంది టీడీపీ యువత సైకిల్ యాత్రగా బయలుదేరి వెళ్లారు. వీరు కడపలో జరిగే జిల్లాస్థాయి మహానాడు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి పవన్‌కుమార్, బూత్ కన్వీనర్ రఫీక్, నవీన్, నాగార్జున, ఆంజనేయులు, మురళి, జయరాం, గౌతమ్ రఫీక్, రాజేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు ఆదినారాయణ



ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవాసమితి సభ్యులు

గోరంట్ల, మే27(ఆంధ్రజ్యోతి): త్రైతసిద్ధాంతాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని ప్రబోధసేవా సమితి అధ్యక్షుడు ఆదినారాయణ పేర్కొన్నారు. మండలంలో కమ్మవారిపల్లిలో త్రైతసిద్ధాంతంపై ప్రబోధసేవా సమితి హిందూజ్ఞాన వేదిక మంగళవారం ప్రచారం చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడు భగవద్గీతను ఉపదేశం చేశారన్నారు. భగవద్గీతతో అసలైన జ్ఞానం తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు రంగప్ప, రాజు, సునీత, జయలక్ష్మి, ఈశ్వరమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



ఫార్మసీ విభాగాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి

సోమందేపల్లి, మే 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా ఉప ఆరోగ్య అధికారి మంజువాణి మంగళవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో లింగనిష్పత్తి, ఆయుష్మాన్ భారత్, హెల్త్‌కార్డులు, పీజీపీఎంపీడీ చట్టంపై ఆరాతీశారు. భ్రూణహత్యలపై తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఎలక్ట్రానిక్ హెల్త్ కార్డుల జారీ ప్రక్రియపై మెడికల్ ఆఫీసర్ ఆయిషా తస్లీంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో వివిధ విభాగాలను పరిశీలించి వాటి పనితీరు, రికార్డుల నిర్వహణను తనిఖీచేశారు. ల్యాబ్, ఫార్మసి, డెలివరి వార్డును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న సర్వే పనితీరుపై ఆరాతీశారు. కార్యక్రమంలో వైద్యులు ఓంకార్, సిబ్బంది మధుబాబు, మనోహర్‌రెడ్డి, రవీంద్ర, రత్నమ్మ, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో ఇబ్బందులు



సబ్‌స్టేషన్‌లో ట్రిప్‌నకు గురవుతున్న ట్రాన్స్‌ఫార్మర్

పరిగి, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల నుంచి పరిగి మండల కేంద్రంలో విద్యుత్ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో కరెంటు కోత ఉంటుండటంతో మండలవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయమై ఏఈ సంజీవప్పను వివరణ కోరగా విట్టాపల్లి గ్రామంలోని ఫ్యాక్టరీకు ప్రధానమైన లైను వెళుతోందని, ఆ లైను ట్రిప్ అవుతోందన్నారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే పైడేటి గ్రామంలో సబ్‌స్టేషన్ ప్రారంభం కావాలని, రాత్రివేళల్లో కరెంటు కోతలు తగ్గించలేమని వెల్లడించారు.

ప్రతిభచాటిన విద్యార్థి



విద్యార్థిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్

పెనుకొండ, మే 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని బెళగావి రాణి చెన్నమ్మ విశ్వ విద్యాలయంలో ఈనెల 19 నుంచి 25 వరకు జరిగిన జాతీయ సమైఖ్యత శిబిరంలో పెనుకొండ విద్యార్థి ప్రతిభకనబరిచాడు. పరిటాల శ్రీరాములు ఎన్ఎ్ ఎస్ విద్యార్థి సుబ్రహ్మణ్యం ఆంధ్రప్రదేశ్ తరుపున ఎంపికై ప్రతిభను చాటాడు. రాష్ట్ర సాంస్కృతిక, సంప్రదాయాలను ప్రదర్శనల్లో పాల్గొన్నాడు. ప్రతిభచాటిన విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేశవరావు, వైస్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ పీఓ జయప్ప మంగళవారం సర్టిఫికెట్, మొమెంటో ఇచ్చి సత్కరించారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన తెలుపుతున్న ఎస్సీ కాలనీవాసులు

మడకశిర రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమిదాల గొంది పంచాయతీ కేంద్రాంలోని ఎస్సీ కాలనీకి తాగునీరు రాకపోవడంతో మంగళవారం ఆ కాలనీ మహిళలు ఖాళీ బందెలతో రోడ్డెక్కారు. దీంతో మడకశిర-పావగడ ప్రధాన రహదారిలో వెళ్లే వాహనాలు గంట పాటు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కాలనీకి వచ్చే తాగునీటి పైపులైను పగిపోవడంతో సమస్య ఏర్పడిందన్నారు. పైపులైన్ మరమ్మతులు చేయాలని అనేకసార్లు అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోలేదన్నారు. దీంతో సమస్య పరిష్కారం కోసం రోడ్డెక్కామన్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి రాజేశ్ వెళ్లి పగిలిపోయిన తాగునీటి పైపులైను బుధవారం మరమ్మతులు చేయిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు వెనుతిరిగారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

గుడిబండ, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేకేపాళ్యం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో సక్రమంగా నీరు సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. అధికారులు వెంటనే చొరవ తీసుకుని తాగునీటి సమస్య లేకుండా సక్రమంగా తాగునీరు అందేవిధంగా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నెహ్రూకు ఘననివాళి

హిందూపురం, మే 27(ఆంధ్రజ్యోతి): దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్థంతి సందర్భంగా మంగళవారం హిందూపురంలో నెహ్రూ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశంలో రాజ్యాంగ, ఆర్థికంగా, సామాజికంగా ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహోన్నత వ్యక్తి నెహ్రూ అని కొనియాడారు. ఆయన విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణలవల్ల మారుమూల పల్లెల్లో ప్రాథమిక విద్య ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు హిదాయతుల్లా, రవూఫ్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

హిందూపురం, మే 27(ఆంధ్రజ్యోతి): ముద్దిరెడ్డిపల్లికి చెందిన వేణు విష ద్రావకం సేవించి ఆత్మహత్యకు యత్నించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. వేణు ఇటీవల ఓ యువతిని ప్రేమించి, తన వెంట తీసుకెళ్లాడు. అయితే ఆమె తల్లిదండ్రులు తమ కుమార్తె అదృశ్యమైనట్లు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అమ్మాయిని యువకుడు తీసుకొచ్చారు. అయితే ఆ అమ్మాయి వేణు వెంట కాకుండా తల్లిదండ్రుల వెంట వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన వేణు మంగళవారం ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించారు. ప్రేమించిన యువతి వదిలి వెళ్లడంతోనే ఇలా జరిగిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థిని ఆత్మహత్య

పరిగి, మే 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొడిగినహళ్లి గ్రామానికి చెందిన హేమ (15) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు. తల్లిదండ్రులు పని నిమిత్తం హిందూపురం వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో తీవ్ర కడుపు నొప్పి భరించలేక ఇంటిలోని పైకప్పుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా తాడుకు వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.